క్లుప్తంగా

నల్లజర్ల ఎంపీడీఓగా సత్యనారాయణ

నల్లజర్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంవీఎస్ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయ ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.ఇంతవరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గోపాలపురం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ మహాలక్ష్మి మంగతాయారు వ్యవహరించారు. ఎంపీడీఓ సత్యనారాయణను ఈఓపీఆర్ సింహాద్రి, ఏఓ మహాలక్ష్మి మంగతాయారు, సీనియర్ అసిస్టెంట్ కుమార్‌ను సత్కరించారు.

తుమ్మాలమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించండి

నల్లజర్ల: చీపురుగూడెంలో గ్రామస్తుల ఆరాధ్య దైవం, గ్రామదేవత తుమ్మాలమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని నూతన కమిటీ చైర్మన్ చెల్లువీరవెంకట్రావు కోరారు. గ్రామపెద్దల సమక్షంలో బుధవారం చెల్లు పెదరామన్న ఇంటివద్ద సమావేశమై కమిటీని ఎన్నుకున్నారు. కమిటీగా చైర్మన్ చెల్లు వీరవెంకట్రావు, వైస్ చైర్మన్ తలంశెట్టి చినవెంకట్రావు, కార్యదర్శిగా తలంశెట్టి మోహన్‌కుమార్, కోశాధికారి గుళ్లపూడి వెంకటరత్నంతో పాటు మరో ఇద్దరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. దిగువ గుడి ధర్మకర్తగా తలంశెట్టి కోటేశ్వరావు వ్యవహరిస్తారన్నారు. అమ్మవారి జాతరను ఐక్యతతో నిర్వహిస్తామని వెల్లడించింది.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

నల్లజర్ల: ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకు కూరలు పండించి ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని అధికారులు అన్నారు. ముసుళ్లగుంటలో బుధవారం మహిళలకు సేంద్రియ సాగు విధానాన్ని వివరించారు. సర్పంచ్ నందమూరి శారదాదేవి, మండల మానవత అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరావు, బలుసుగంగరాజు, నందమూరి సుబ్రమణ్యం విరాళంగా అందజేసిన 3,500 రూపాయలతో 12రకాల విత్తనాల మినీ కిట్లుగా రూపొందించి 150 మంది మహిళలకు అందజేసారు. ప్రకృతి వ్యవసాయ విభాగం డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, ఐసీఆర్పీ నాగలక్ష్మి, వీఓఏ నాగదేవి శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన అనిశెట్టి శ్రీనివాస్, ఉమాకుమారి దంపతుల కుమారుడు ప్రసన్నకుమార్ పేరున బుధవారం రూ.50,116 విరాళం అందజేశారు. విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులకు అందజేశారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..!

- ఎంపీటీసీలపై ప్రభుత్వం చిన్నచూపు
- వేతనాల విడుదలను విస్మరించిన కూటమి
- ఉత్సవ విగ్రహాలుగా మిగిలామని సభ్యుల ఆవేదన



సమిశ్రగూడెంలో సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

నిడదవోలు రూరల్: ప్రజల అభిమానం పొంది ఎన్నికల్లో గెలిచారు.. కానీ అధికారాలు మాత్రం వారికి అందడం లేదు. గ్రామాల్లో ఏ పని చేపట్టాలన్నా కూటమి నాయకులదే తుది నిర్ణయంగా పరిస్థితి తయారైంది. దీంతో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నారు. గ్రామాల్లో ఏ చిన్న పని జరగాలన్నా కూటమి నాయకులకే అధికార యంత్రాంగం సైతం ప్రాధాన్యం ఇవ్వడంతో విపక్ష సభ్యులకు గ్రామాల్లో ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయి. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన ప్రభుత్వం.. పాలన వ్యవహారాల్లో సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి కూటమి నేతలకు పెత్తనం అప్పగిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానం పంపకపోగా వారికి అందాల్సిన వేతనాలను విడుదల చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు మండలంలో 23 గ్రామాలు ఉండగా.. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో 20 ఎంపీటీసీ సభ్యులకు 18 చోట్ల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు గెలిచి ఎంపీపీ పదవి కైవసం చేసుకున్నారు. జెడ్పీటీసీ పదవి కూడా వైఎస్సార్ సీపీ కై వసం చేసుకోగా.. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన టీడీపీలో చేరారు.

నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

ఎంపీటీసీ సభ్యులకు నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. దీంతో పనులు చేయలేక ముఖం చాటేసుకుంటున్నారు. మండలంలో సుమారు రూ.80 లక్షలు మండల పరిషత్‌లకు వచ్చే నిధులతో పాటు ఉపాధి హామీ పథకంలో మంజూరు చేస్తున్న నిధులను కూటమి నాయకులకు మాత్రమే పనులు అప్పగిస్తున్నారు. దీంతో కొంతమంది ఎంపీటీసీ సభ్యులు పలు సమావేశాల్లో అధికారులను నిలదీయడంతో మీ పేరుపై పనులు మంజూరు చేస్తాం.. కానీ కూటమి నాయకులే ఆ పనులకు సంబంధించిన కాంట్రాక్ట్ చేస్తారని అధికారులు సమాధానం చెప్పడంతో గ్రామ స్థాయిలో విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని శెట్టిపేట, అట్లపాడు, సమిశ్రగూడెం గ్రామాల్లో పనులు మంజూరు విషయాల్లో నాయకుల మధ్య అధిపత్య పోరు తలెత్తింది.

ఎంపీటీసీ సభ్యుల విధులు.. బాధ్యతలు..

గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో సర్పంచులతో పాటు ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు సూచనలు, సలహాలు ఇస్తుండాలి. రేషన్ దుకాణాలు, పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయవచ్చు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో అధికారులను ప్రశ్నించే అధికారం వారికి ఉంది. గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులను వెచ్చించే విషయంపై ఆరా తీయడంతో పాటు అభ్యంతరాలను వ్యక్తం చేయవచ్చు. అయితే ప్రస్తుతం మాత్రం గ్రామాల్లో జరుగుతున్న పాలక వర్గ సమావేశాలు, ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు విపక్ష సభ్యులకు సరైన సమాచారం ఇవ్వడం లేదు. దీంతో ప్రజల్లో చులకనగా ఉండటంతో పాటు పలుమార్లు చేదు అనుభవాలు కూడా ఎదురవుతున్నాయి. అధికారులు సైతం కూటమికి చెందిన కార్యకర్తలకు మాత్రమే సమాచారం ఇస్తూ విపక్ష సభ్యులను మాత్రం పట్టించుకోవడం లేదు.

24 నెలలుగా అందని జీతాలు..

ఎంపీపీకి రూ.6 వేలు, ఎంపీటీసీ సభ్యులకు ప్రతి నెల రూ.3 వేల ప్రకారం గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ హయంలో రెండు విడతల్లో గౌరవ వేతనం చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికే 24 నెలలుగా గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల్లో గౌరవ వేతనాలు సైతం పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మమ్మల్ని కూడా మోసం చేసిందని ఎంపీటీసీ సభ్యులు విమర్శిస్తున్నారు. అయితే, అధిక శాతం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందిన వారు కావడంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

పేరుకే ఎంపీటీసీలుగా ఉన్నాం



మండలంలో పేరుకు మాత్రమే ఎంపీటీసీలుగా ఉన్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కొద్దిపాటి నిధులు కూడా కూటమి నాయకులకే మంజూరు చేస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడినప్పటికీ నిధులు మంజూరు కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. తమను సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు. కనీసం ఏ పనులు చేపడుతున్నారో కూడా ఎంపీటీసీలకు ఇచ్చే సమావేశం అజెండాలో నమోదు చేయడం లేదు.

– బయ్యే కృష్ణబాబు, ఎంపీటీసీ సభ్యుడు, తాళ్లపాలెం

గౌరవ వేతనం మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా మాకు ఇప్పటికీ గౌరవ వేతనం ఇవ్వలేదు. రెండేళ్లుగా గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. మూడు నెలలకు ఒకసారి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి వెళ్లడం తప్ప అంతకు మించి గౌరవం కనిపించడం లేదు. చిన్న, చిన్న సమస్యలు చెప్పినా కూడా అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గౌరవ వేతనం నిధులు విడుదల చేయాలి.

– వదల రత్నకుమారి, వైస్ ఎంపీపీ, సమిశ్రగూడెం

రైతులకు అండగా నిలవాలి







మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తానేటి వనిత

చాగల్లు/తాళ్లపూడి/ నిడదవోలు : తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలం పెద్దేవంలో ఇటీవల పాడి పశువుల అకాల మృతి విషయాన్ని తలారి వెంకట్రావు సమావేశంలో మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పశువులు చనిపోయినా రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై జగన్ స్పందిస్తూ పశువుల యజమానులు, రైతులకు అండగా నిలవాలని సూచించారని తలారి తెలిపారు.

తలారికి జన్మదిన శుభాకాంక్షలు

తలారి వెంకట్రావుకు మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న తలారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ఇంపాక్ట్



త్యాజంపూడిలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కుసులూరి స్వరూరాణి

దేవరపల్లి: త్యాజంపూడిలో మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ నెల 15న 'నీరుగారుతున్నాయ్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో 60,000 లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణానికి జలజీవన్ మిషన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ.48.40 లక్షలు మంజూరయ్యాయి. బుధవారం సర్పంచ్ కులులూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, ఎంపీటీసీ సభ్యులు కాళ్ల వెంకటరత్నం, పల్లి రాంబాబు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో కొత్త ట్యాంకు నిర్మాణానికి 2023–24లో జలజీవన్ మిషన్‌లో ప్రతిపాదనలు పంపించినట్టు సర్పంచ్ స్వరూపరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు అభినందనీయం



వాదాలకుంటలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై మనోహర్

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, మానవత సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని గోపాలపురం ఎస్సై పి.మనోహర్ అన్నారు. మండలంలోని వాదాలకుంటలో బుధవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాన్ని ఎస్సై మనోహర్ ప్రారంభించారు. సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు రాపాక ఫణి కిషోర్, నెల్లి చంద్రశేఖర్, కృపావరప్రసాద్‌రెడ్డి, జుజ్జవరపు ప్రసాద్, యెల్లిన కిరణ్‌భాస్కర్, వడ్లమూడి రమేష్, వుండవల్లి దేవేంద్రప్రసాద్, జేష్ట జ్ఞానేష్ చౌదరి, మండల మానవత సభ్యులు, ఆశ్రమ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత పాడి రైతులను ఆదుకోవాలి



శాసన మండలిలో పెద్దేవంలో గేదెల మృతి అంశంపై మాట్లాడుతున్న చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

తాళ్లపూడి: పెద్దేవంలో ఇటీవల కొద్ది రోజులుగా పాడి గేదెలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, నష్టపరిహారం అందజేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బుధవారం శాసన మండలిలో గేదెల అకాల మృతి అంశం మరోసారి చర్చకు వచ్చింది. సభలో మోషేన్‌రాజ్ స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. గ్రామంలో పశువులు నేటికీ చనిపోతున్నాయని, ఇప్పటి వరకు 33 గేదెలు మృతి చెందాయని, అక్కడ అంతా పేద రైతులని వారిని ఆదుకోవాలని తెలిపారు. రైతులకు నష్టపరిహారం లేదా బీమా అందజేసి ఆదుకోవాలని సూచించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత వరకూ సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

నల్లజర్ల: తెలికిచెర్ల శివారులో పేకాటస్థావరంపై బుధవారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసారు.ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

పొగాకు నాణ్యతపై రైతులు దృష్టి సారించండి



చెరుకుమిల్లిలో పొగాకు రైతుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజరు ప్రసాద్

దేవరపల్లి: పొగాకు నాణ్యతపై రైతులు దృష్టి సారించాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని చెరుకుమిల్లిలో బందపురం, దుద్దుకూరు, చెరుకుమిల్లి గ్రామాల్లోని పొగాకు రైతులకు నారుమడి యాజమాన్య పద్ధతులు, పంట నియంత్రణపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారిణి సీహెచ్ హేమస్మిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రీజనల్ మేనేజరు ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి 3,762 మిలియన్ల కిలోల నుంచి 4,197 మిలియన్ల కిలోలకు పెరిగిందన్నారు. బ్రెజిల్, జింబాబ్వే, చైనా దేశాల్లో అధికంగా పొగాకు ఉత్పత్తి అవుతున్నందున ప్రస్తుతం మన రైతులు పండించిన లోగ్రేడు పొగాకును మంచి ధర రావడం లేదన్నారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో సుమారు 22 మిలియన్ల కిలోలు అదనంగా ఉత్పత్తి జరిగిందని ఆయన తెలిపారు. 2025–26 పంట కాలానికి పంట నియంత్రణ పాటించి, కేటాయించిన పరిమాణానికి లోబడి మాత్రమే సాగు చేయాలని ఆయన సూచించారు. నారుమడులను పరిశీలించి నారుమడి పెంపకం, తెగుళ్ల నివారణకు పురుగు మందుల వాడకం గురించి రైతులకు సూచించారు. రిజిస్ట్రేషన్ పొందిన రైతులకు మాత్రమే నారు విక్రయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీపీఐ కంపెనీ ప్రతినిధి రవి, పీఎస్ఎస్ ప్రతినిధి సీతారామరాజు, క్షేత్రస్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా తలారి పుట్టినరోజు వేడుకలు



కొవ్వూరులో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో తలారి వెంకట్రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు హాజరై తలారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీలు జొన్నకూటి పోశిరాజు, మట్టా వీరాస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు సుంకర సత్యనారాయణ, పిట్టా శ్రీనివాస్, గూడా విజయరాజు, యాళ్లబాబు రావు, తోట రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరవు, జిల్లా ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, నామ ప్రకాశం, ఎల్లిన శ్రీను, కొయ్యే దుర్గారావు, బట్టు సుబ్బారావు, చిక్కాల మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న దేవరపల్లి తహసీల్దార్

దేవరపల్లి: నిత్యావసర సరకులను వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాస్ డీలర్లను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం మండల సరఫరా అధికారి ఎ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ పంపిణీలో జిల్లాలో దేవరపల్లి మండలాన్ని ప్రథమస్థానంలో ఉంచాలని ఆయన సూచించారు. 26 నుంచి 30వ తేదీ వరకు 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచాన ఉన్న వారికి ఇంటింటికీ తీసుకెళ్లి సరకులు అందజేయాలని ఆయన తెలిపారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. రేషన్ దుకాణాలను ప్రతి నెల తనిఖీ చేస్తామని చెప్పారు. స్మార్ట్ కార్డుల పంపిణీ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ప్రతి రేషన్ దుకానికి కొత్త ఈ పోస్ మిషన్లను ప్రభుత్వం అందజేసినట్టు ఆయన తెలిపారు. దుకాణాల వద్ద ధరల పట్టిక, నిల్వల బోర్డు, క్యూ ఆర్ కోడ్ బోర్డు తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మ



తిమ్మరాజుపాలెంలో విశేష స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిస్తున్న కోటసత్తెమ్మ అమ్మవారు

పెరవలి: దేవీ నవరాత్రులు సందర్భంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమివ్వడంతో భక్తులు పరవశించారు. ఖండవల్లి, అన్నవరప్పాడు,పిట్టల వేమవరం పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరులో ఉదయం 6 గంటల నుంచి ఆలయాల వద్ద కుంకుమార్చన నిర్వహించారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, వెంకట్రాయపురం, పెరవలిలో అమ్మవారి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

అన్నపూర్ణేశ్వరికి పూజలు

నల్లజర్ల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడవ రోజు పోతవరం జమ్మిచెట్టు వద్ద కామాక్షి అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భేతిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.యడ్లపల్లి నిరంజన్ దంపతులు ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అనంతపల్లి స్వర్ణదుర్గా ఆశ్రమంలో పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నల్లజర్ల వనదుర్గాలయం, దూబచర్ల, కవులూరు, తూర్పుచోడవరం, అనంతపల్లి ఆనందతిరుమల వేంకటేశ్వరాలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

ఆలయాల్లో కుంకుమ పూజలు

నిడదవోలు: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు సంగాని వెంకటనారాయణ, అర్చకులు బాదంపూడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

నిడదవోలు రూరల్: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం మూడోరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 213 మంది దంపతులు సహస్రనామ కుంకుమ పూజలతో పాటు చండీపారాయణం, హోమం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.86,588 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ చెప్పారు. కోటసత్తెమ్మ విశేష స్వర్ణాభరణములతో, తాడిమళ్లలోని మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. గోపవరం గుబ్బాలమ్మ, సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద కుంకుమ పూజ నిర్వహించారు.

దుర్గమ్మకు పూజలు

గోపాలపురం: గుడ్డిగూడెం రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి బుధవారం భక్తుల తరలివచ్చి పూజలు చేశారు. దుర్గాదేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.